# త్రివర్గం

ఈ మధ్య కవిత్వం నన్ను వేపుకు తింటున్నది. పొరపాటున ఓ సాహితీబృందంతో పరిచయమయింది. అందువల్లే, ఆ ప్రమాదం సంఘటిల్లింది. వారికి నన్ను పరిచయం చేస్తూ, మా మిత్రుడు 'జున్ను' (జనార్ధనం), "వీరు పాణిని గారని మంచి కవులు, కథకులు. వీరు నా మిత్రులవటం నేను చేసుకున్న అదృష్టం!" అన్నాడు.

"మరి ఓ కవితో, కథో వినిపించండి, మా జన్మ చరితార్థమయ్యేటట్లు" అన్నాడు హనుమంతు. అతడి నోరు నవ్వుదుంటే నొసలు వెక్కిరిస్తుంటాయి. ఈ మనుషుల తీరే అంత! ఎవడయినా ప్రతిభకలిగినవాడు ఉన్నాడంటే సహించ లేరు. నాకూ, జున్నాకూ కూడా కోప మొచ్చింది. అప్పటి నుండి మా జున్ను ఒకటే సతాయించ సాగాడు, కవిత ఏదయినా రాయమని. దాన్ని మిత్రబృందం ముందు చదవమనీ.

"నీకేం లోటు! త్రి'వ'ర్గాలున్నాయి. కొద్దిగా కృషి చేస్తే అటు పేరుకు పేరూ, డబ్బూ కూడ రావచ్చు" అన్నాడు.

మనకు సత్తా ఉన్నా, లేకపోయినా కీర్తి ఊర్కే వస్తుందంటే వెంట పడనివాడెవడూ?

అందుకే, అందుకు సమాయత్తమవుతూ, "త్రివర్గాలేమిటి?" అని అడిగాను.

"వీపు, వూపు, వమనం. వీపంటే బ్యాక్ గ్రౌండ్. బాగా చదువుకున్నావు. కనుక కవితలు, కనీసం చచ్చు కథలు రాయటానికైనా నీకు నేపథ్యం ఉన్నట్టే! వూపంటే 'మూడు' రావటానికి తగిన దోహద క్రియలు. అందుకు సిగరెట్టు, లిక్కరు, పాను వగైరా మన శక్తి సామర్థ్యాల ననుసరించి ఉపయోగించుకోవచ్చు. నీకెలాగో సిగరెట్టలవాటుంది. ద్రావకం కూడ అప్పుడప్పుడు పుచ్చుకుంటావు. ఇంక వమనానికి తగిన అన్ని అర్హతలు ఉన్నట్టే!" అని వివరించాడు జున్ను.

నిజంగా నాకు సంతోషమేసింది. "వమనమంటే?" అని అడిగాను.

"అంటే పేపరుమీద కక్కెయ్యటమే!"

"ఏంటి?"

"ఏంటేమిటి, నీ బొంద! కవిత రాసెయ్యటమో, లేకపోతే ఓ చచ్చు కథ గిలికెయ్యటమో!"

"కాస్తంత సరిగ్గా వివరించు, ఈ త్రివర్గాల గురించి..."

"చదువుకున్నావు కనుక నీకు ఇతర కవుల కవితలు, రచయితల కథలు గుర్తుకు రావచ్చు. వాటిని కొద్దిగా మార్చి, నీ సొంతమైన దేదో రాసేసుకోవచ్చు. అలా నేపథ్యం పనికి వస్తుంది. ఆ అవసరం లేకుండానే, సరయిన పద్ధతిలో దోహద క్రియలు పచరిస్తుంటే, నీకే 'వూపు' కలుగుతుంది, డివైన్ ఇన్‌స్పిరేషను కలుగుతుంది. ఇట్ కమ్స్ ఇంటర్మిటెంట్‌లీ, బట్ నాట్ ఆల్వేస్ అని ప్రముఖ అమెరికా కవి, డిటెక్టివ్ కథల పితామహుడు అడ్గార్ అల్లెన్ పో చెప్పాడు. ఆ డివైన్‌లైట్ అలావచ్చి ఓ మెరుపు మెరిసి పోతుంది. కవిత్వం అలా వస్తుంది. అలా వచ్చేదాన్ని వడిసిపట్టుకోవాలి. దీన్నే 'మూడ్' అంటారు. అప్పుడే చక్కటి కవితా సృజన జరుగుతుందట! దీనికి కొంత కాలం పడుతుందనుకో! ఇంక రాసేప్పుడు ఆలోచనలు ఓ పద్ధతిలో రాలేదని మానెయ్య కూడదు. ఎ.జె.క్రోనిన్ అని ఆంగ్ల రచయిత ఉన్నాడు. ఆయన డాక్టరు. ఆ తర్వాత డాక్టరీ మానేసి రచయితగా స్థిర పడ్డాడనుకో. అది వేరే విషయం. ఆయన స్కూల్లో చదువుకునేటప్పుడు ఆయన గురువో మాట చెప్పాడు, 'గెటిట్ డౌన్, ఇఫిట్ స్టాప్స్ ఇన్ యువర్ హెడ్, ఇట్విలాల్వేస్ బి నథింగ్' అని. కనుక, బుర్రలోకి ఏదొస్తే అది రాసెయ్యటమే. అర్థం చేసుకోవాల్సి బాధ్యత పాఠకులది. ఇంక 'వమనా'న్ని కూడ నువ్వు తేలిగ్గా తీసుకో కూడదు. రాయటమే కాదు. దాన్ని ప్రచురింప చేయాలి. సంపాదకుల నాశ్రయించాలి. వివిధ మార్గాల ననుసరించాలి. ఇవన్నీ 'వమన' వర్గంలోకే వస్తాయి. ఇప్పుడవన్నీ చెప్తే నువ్వు వక్రమార్గాలనుకోవచ్చు. ఏదిగాక, నీ కన్నీ నేను చెప్తాగా!" అని నాలో ధైర్యం కలిగించాడు

వాడి మాటలకు అప్పటికి సంతోషపడ్డాగానీ, త్రివర్గాలనుపయోగించే ప్రయత్నం చెయ్యలేదు. హాయిగా, సరదాగా మిత్రులతో బాతాఖానీ చేస్తూనో, ఒళ్ళువంచి పేకాడుతూనో, ఇతోధికంగా సుఖపడుతున్న మనిషిని చూసి కళ్ళు కుట్టాయి, మా ఆవిడకు. లోక సహజం!

"ఎందుకూ సాహిత్యం చదివారు? దండగ! కథలో, కవితలో, కాకరకాయలో రాసుకోక టైమ్ వేస్ట్ చేస్తారు! మన సరోజ రాసిన కవితలు పేపర్లో పడితే అందరూ ఎంతగా బ్రహ్మరథం పట్టారో ఆమెకు? మీరు కవో, కథకుడో అయితే నాకెంత పేరు!"

అంది. ఆమె లాజిక్ నాకర్థం కాలేదు, నేను కవో, కథకుడో అయితే ఆమెకెలా పేరు వస్తుందో?

ఇంటావిడ మాటలు నిర్లక్ష్యం చేయ తగదు కనుక, ఆ ప్రయత్నంలో భాగంగానే, రాత్రి ఇంటికొచ్చేటప్పుడు, రెండు సిగరెట్టు పెట్టెలు కొనుక్కు వచ్చాను. భోజనం కానిచ్చి ఇంటావిడతో కబుర్లాడకుండా, టేబుల్‌ముందు కూర్చుని కాయితాలతో యుద్ధం చేయసాగాను. మూడు రాలేదనిపించి ఒక సిగరెట్టు తర్వాత మరోటి ముట్టించ సాగాను. జుట్టు పీక్కున్నాను. ప్రయోజనం కన్పించలేదు. ఇంక ఇప్పుడు 'మూడ'టం సాధ్య పడేట్టు కన్పించలేదు కనుక, తెల్లవారుఝామున లేచి దాని అంతు చూద్దామనుకున్నాను. తెల్లవారుఝామున నాలుగ్గంటలకు అలారం మోగగానే, ఠక్కున మెలకువ వచ్చింది. కాలకృత్యాలు కానిచ్చి తెల్ల కాయితాలు ముందేసుకుని, 'మూడ'టానికి సిగరెట్టు ముట్టించి కవిత్వ సాధన మొదలు పెట్టాను. కొంచెం సేపున్నాక, నా కర్థమయింది కవిత్వం కంటే కథ తేలికని. కనుక, కవిత్వాన్ని ప్రస్తుతానికి వాయిదా వేసి కథ రాద్దామనుకున్నాను. కొత్త మూడు కోసం మరో సిగరెట్టు వెలిగించాను. విపరీతమైన ధైర్యం వచ్చింది. వడియాల పిండి రుబ్బినట్టు కథలు పండించగలననుకున్నాను.

ఏవేవో అయిడియాలు వస్తున్నాయి కానీ, ఏవీ కాయితం మీద పెట్టేందుకు అనువుగా లేవు. అయినా కాయితం మీద పెడ్దామని ప్రయత్నించే సరికి ఆవిరయిపోయాయి. పెన్ను పక్కకు పెట్టగానే, నా అసంబద్ధ ఆలోచనలన్నీ తిరిగి వచ్చాయి, సగం పెరిగిన దయ్యాల్లా నన్ను చుట్టు ముట్టాయి. భయం వేసింది. దేవుడికి మొక్కుకున్నాను, ఈ ఆపదనుండి గట్టెక్కించమని. అప్పుడు తట్టింది అసలు విషయం. విఘ్న నాయకుడయిన వినాయకుడికి మొక్కకుండా, ఏ పనీ ప్రారంభించ రాదన్న జ్ఞానోదయం కలిగిన వాడినై, కాయితం మీద 'శ్రీ విఘ్నేశ్వరాయ నమః' అనీ, ఆపైన, 'సరస్వతీ దేవ్యై నమః' అనీ రాశాను. ఎందుకైనా మంచిదని ఆ కింద 'శ్రీరాములవారి సహాయము కావలెను' అనీ రాశాను. మీరు నవ్వకండి. ఎంత హేతువాదులకైనా ఆపత్సమయంలో దేవుఁడు గుర్తుకు వస్తాడు. రచనా సమయం వదిలేస్తే నేనూ మీలా పక్కా హేతువాదినే!

అలా రాసేసింతర్వాత మనస్సు ఆనందంతో ఉప్పొంగిపోయింది. ప్రార్థించిన దేవతలు ఆవహించినట్లు శరీరం బరువెక్కింది. ఇంక త్వరగా 'మూడ్'లోకి పడాలన్న వర్రీలో వరసగా ఐదు సిగరెట్లు కాల్చేశాను. బుర్ర వేడెక్కింది, పెదవులు మండసాగాయి, కళ్ళంబట నీళ్ళు వచ్చాయి. అప్పుడు దేవుఁడు కరుణించాడు. వరద ముంపొచ్చినట్టు వర్షాపాత మయింది. మొదట్లో అన్పించింది- మూడటమంటే ఇదేమోనని. అయితే, నా బట్టలు, కాయితాలు

కూడ తడిసిపోవటంతో, మరేదో అనర్థం జరిగిందన్న జ్ఞానోదయం కలిగింది. 'మేఘరహిత అకాల వర్షాపాతం, అందులోనూ నా గదిలోకి?' కిటికీకుండా బయటకు తొంగి చూశానో లేదో, మా పక్క పోర్షను గరప్ప చెట్టి మరో బక్కెటతో నీళ్ళు తెచ్చి, కిటికీకుండా లోపలికి పోయబోతున్నాడు.

పెద్దగా అరిచాను, "నీళ్ళెందుకు పోస్తున్నావయ్యా? ఆపెయ్యి" అని.

"కిటికీలోనుండి ఒకటే పొగ వస్తావుండాది. ఏదయినా కాలిపోతున్నదేమోనని భయమేసినాది. నిప్పు లేకపోతే పొగరాదన్జెప్పి నీళ్ళుపోసినా. ఒక ఇల్లంటుకుంటే పక్కనున్న ఇళ్ళూ అంటుకోవూ?" అన్నాడు గురప్ప చెట్టి.

అతను ఇతరులకు సాయం చెయ్యాలని ప్రయత్నించి ఇలా అభాసు పాలవుతుంటాడు. అతని మంచితనానికి మెచ్చుకోవాలో, నా దీనస్థితికి విలపించాలో తెలియక, "ఇంకెప్పుడూ ఇలా పొరపడక. గదిలో నేను సిగరెట్టు తాగుతున్నాను. మరో మహత్కార్యంలో నిమగ్నమయి ఉన్నాను. ఏ విషయం నిర్ధారణ అయిందాకా ఆదుర్దాపడి ఇలా హడావుడిగా ఏదోఒకటి చేయకూడదు. 'సహసా విదధీత నక్రియాం' అని కదా హితవాక్యం" అని అతనికి గీతోపదేశం చేశాను. అతను కాస్తంత సంప్రదాయవాది. అర్థం తెలియక పోయినా, అతనికి సంస్కృతంలో చెప్తే బాగా పట్టుబడుతుంది, కవిగా ఎదగాలని తాపత్రయ పడుతున్న నా 'ప్రతిభా అతనికి అర్థమవుతుంది. 'అంటే అర్థమేమిటండీ?' అని అతను అడగక పోబట్టి నా పరువు నిల్చింది. నిజానికి, సంస్కృతానికి అర్థమేముంటుంది?! సంస్కృతం మాట వినంగానే భక్తి శ్రద్ధలతో మొక్కుకోమని నా చిన్నప్పుడెప్పుడో మా అక్క చెప్పింది.

ఇంక ఇంట్లోకి వెళ్ళి లైటేశాను. ఇంతకుముందు, 'మూడ'టం కోసం, లైటార్పేసి, ధూమపానం చేస్తూ, మానసిక కుస్తీ పడుతున్నందువల్ల ఇంత అనర్థం జరిగింది. లైటు వెలుగులో విఘ్నేశ్వరుడు, సరస్వతీదేవి, శ్రీరాముడు నీళ్ళల్లో తేలుతున్నారు. సిగరెట్లు నీళ్ళు తాగుతున్నాయి. గది పరిస్థితి చూస్తే ఇంటావిడ మరో ప్రళయం సృష్టిస్తుందని, నీళ్ళను తూముకుండా బయటకునెట్టి, దుప్పటితో గది తుడిచి, తడిసిపోయిన కాయితాల్నీ, సిగరెట్టు పాకెట్టునీ బయట పారేసి (పాపం శమించుగాక- దేవతలూ వెళ్ళిపోయారు వాటితో పాటుగా), మళ్ళీ కొన్ని తెల్లకాయితాలు తీసుకుని, పెన్ను నోట్లో ఇరికించి, తిరిగి రచనా వ్యాసంగానికి ఉద్యమించాను.

ఇంటావిడ వంటింట్లోనుండి అరుస్తోంది. "మీకేం పని లేదుటండీ పొద్దున్నే సిగరెట్టు తగలేసుకుంటూ కూర్చున్నారు! పోయి ఆ పాలవాడు ఎటుచచ్చాడో చూడరాదూ?" అని.

స్టీమ్ ఇంజనులో ఆవిరులొచ్చినట్టు వంటింట్లోనుండి వేడి గాడ్పులు వీస్తున్నాయి. అప్పటికే ఆరున్నరయింది. పాలవాడు పాలు తేలేదు. ఇంకో పావుగంట గడిస్తే ఆవిడకు తలనొప్పి రావటం ఖాయం. నేనింకా ఇలాగే కూర్చుని ఉంటే దాన్ని ఆవిడ నాకు ఇన్‌ఫెక్ట్ చేసే ప్రమాదమూ ఉంది.

అయినా, 'ఆరంభించరు నీచమానవులు...' అన్నట్టుగా కాక, ఎంతోకొంత మనమూ రచనా యజ్ఞంలో సమిథ వేసి మనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి అన్జెప్పి, పని మధ్యలో వదలిపెట్టి వెళ్ళటం ఇష్టంలేక అలాగే కూర్చున్నాను. 'అమ్మో, గురప్ప చెట్టీ! బంగారు సిగరెట్లన్నీ పొట్టనబెట్టుకున్నావు కదయ్యా! ఇప్పుడు 'మూడ'మంటే అయ్యే పనా?' అనుకున్నాను. కనీసం కాఫీకూడ లేకపోవటం ఎంత దురదృష్టం! 'ఈ అల్పమయిన వాటి లోటు వల్ల కాకపోతే, ఈ పాటికి నేనో మహాకావ్యం రాసి ఉండేవాడినా? లేక కనీసం ఓ చచ్చు కథయినా గిలికి ఉండేవాడినా?' అన్పించింది నాకు.

అంతలో విఘ్నం మరోరూపంలో అవతరించింది. మంచిపనులు తలపెడ్తే అన్నీ విఘ్నాలే కదా? అలా వచ్చిన విఘ్నమూర్తి గణపతిగారు. మా ఇంటి యజమాని. నన్ను 'పాన్నీ' అని పిలుస్తాడు.

"'పాన్నీ' ఏమిటి? మా ఆయన పేరు చక్కగా పాణిని అయితే" అని ఓ రోజు ఆయనతో పోట్లాట వేసుకుంది మా ఆవిడ.

"మీ ఆయన్ను చూస్తే నాకు ముచ్చటేస్తుందమ్మాయ్! 'చిన్ని', 'పాన్ని' అని మనం గారాబంగా పిల్చుకోం? అంతే" అన్నాడా ముసలాయన.

ఇంక ప్రస్తుతానికి వస్తే, "ఏంవయ్యా, పాన్నీ! నీకసలు బుద్ధుందీ? ఆ పాల వెధవ ఇంతవరకూ తగలడలేదు. నువ్వు నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నావు! అసలు వాడిని కుదిర్చేటప్పుడే చెప్పా- ఈ వెధవలు సరిగా టైముకు తేరయ్యా- అని. నువ్వు వింటేగా?" నోట్లో టూత్‌బ్రష్, ఎడం చేతిలో చుట్టతో అపరవిఘ్నమూర్తిలా కన్పించాడాయన.

ఇంటావిడ వదలినా, ఈయన వదలడు. 'ఇహ లాభంలేదు. ఈ పరిస్థితుల్లో ఉరుములేకాని మెరుపులు (డివైన్ ఇన్‌స్పిరేషన్) మెరిసేట్టు లేవు' అనుకుని, "ఇప్పుడే వెళ్ళి చూసి వస్తాను, మహాశయా!" అని గణపతిగారికి చెప్పి, బయట పడ్డాను.

వెతికి వేసారి ఆ పాలకుర్రాడిని పట్టిబంధించి తెచ్చాను.

"ఏరా వెధవా, ఎందుకు లేటయింది?" అని అరిచాడు గణపతిగారు పైనుంచి.

"వెధవా, గిధవా అనకండి సార్! మంచిగా మాట్లాడండి. వ్యాను లేటయింది" అన్నాడు వాడు.

దాంతో, "ధూత్తెరీ భూషడికె..." అని లేచాడు ఆయన. "వెధవన్నర వెధవ, చచ్చు వెధవ, సన్నాసి వెధవ! ఏం పొగ(రా నీకు! నేను తాగే చుట్టంత లేవు! నాకే ఎదురు చెప్తావు, బే! చెమ్డాలెక్కడీస్తాను" అని తిట్ల వర్షం కురిపించసాగాడాయన.

ఆయన, రాజకీయ నాయకుల్లా, ఇంకోళ్ళ మాట విన్పించుకోడు. ఇంక లాభం లేదని పాల కుర్రాడిని బతిమిలాడి, బయటకు తీసుకెళ్ళి, వాడి చేతిలో ఓ రూపాయుంచి, "నువ్వు ఏమనుకోకు, పెద్దాయన కదా! అట్లా అంటుంటాడు ఊర్కెనే. తిట్టాలని తిట్టడు" అని నమ్మ బలికి, ఇంటికి వచ్చేటప్పటికి మా శ్రీమతి ఆపసోపాలు పడ్తూ, కాఫీ పెట్టి తనో గ్లాసెడు పుచ్చుకుని, నాకో అరకప్పిచ్చింది.

ఆ కాఫీకషాయాన్ని పుచ్చుకోగానే నా మనస్సు అమందానందంలో ఊగులాడింది. చేసిన తప్పు ఇప్పుడు అర్థమయింది. దోహద క్రియలు పచరించక, 'ఊరక కృతుల్ రచియింపుమన్న సాధ్యమే?' అని తెలిసింది. 'రమణీ ప్రియ దూతిక తెచ్చి ఇచ్చే కప్పురపు విడెపు' లోటూ తెల్సివచ్చింది. "చూడవోయ్! కాఫీలో దేంవుడు ఏ మహాశక్తి పెట్టాడో గానీ, ఎరువు వేసిన పైరులా, శరీరంలో కడబట్టిన ప్రాణాలన్నీ 'పోలో'మంటూ పరుగెత్తుకొస్తున్నయ్!" అన్నాను మా ఆవిడతో.

"సరేలెండి శుద్ధీబుద్ధీలేని పాడు ఉపమానాలూ మీరూనూ. ఇవాళ ఆదివారం. ఇల్లు కడగాలి. పంపుపోయింది. కాస్త బోరు కొట్టి పెట్టండి" అంది ఆమె.

'రమణీ ప్రియ దూతిక' ప్రస్తావన ఆమె దగ్గర చెయ్యా లేదు.

కథలు గిలకకపోతే కొంపలంటుకుపోవుగానీ, శ్రీమతి ఆదేశాన్ని పాటించకపోతే ఇల్లు రణరంగమవుతుంది. 'తీరిక దొరక్క రాయలేదు కానీ, ఈ పాటికో పది కవితలు లేక కథలు గిలికి పారెయ్యకపోయేవాడినా?' అని మిత్రబృందం ముందు ఓ చిన్నపాటి సొరకాయ కోసేసి, మా జున్ను పరువు నిలబెట్టాలని నిశ్చయించుకుని, బక్కెట పుచ్చుకుని బోరు పంపు వద్దకు వెళ్ళాను.

త్రివర్గాల్లో, రెండు నిండుగా ఉండికూడా, 'వమనం' చెయ్యలేక పోవటం పాఠకజన దౌర్భాగ్యం! భయపడాల్సిన పని లేదు. భవిష్యత్తు మీద ఎప్పటికీ ఆశ విడనాడకూడదు మీరు!

స్వప్న, మాస పత్రిక, అక్టోబరు, 2011